పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అనంతగిరి: ఏజెన్సీలోని అరకు, అనంతగిరిలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు వేలాదిమంది పర్యాటకులతో పోటెత్తాయి.వరుసగా రోజులు సెలవు దినాలు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు అనంతగిరి. బొర్రా గుహలు. కటికి. .తాడిగుడ జలపాతాలతో పాటు అనంతగిరి అటవీ ఘాట్ రోడ్డు మలుపులను సందర్శించారు. డమ్ముకు, సుంకరమెట్ట, యు పాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ తదితర ఆహ్లాదకరమైన ప్రదేశాలను తిలకిస్తూ కుటుంబ సమేతంగా ఆనందంగా గడపారు.బొర్రా గుహలు తిలగించిన పర్యాటకులు ఆశ్చర్యానికి లోనయ్యారు. గుహలు ఏ విధంగా ఏర్పడింది తదితర వివరాలను గాడ్స్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డమ్ముకు, కాఫీ ప్లాంటేషన్లు జనాలతో కీటకిటలా డడంతో ట్రాఫిక్ అంతరాయంలో వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులకు గురయ్యారు.

బొర్రా గుహల్లో పర్యాటకులు

ఉత్సాహభరితం..విజ్ఞానదాయకం..

-ఆటల పోటీలతో విద్యార్థుల సందడి- కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు విద్యార్థుల ఆటల పోటీలతో ఉత్సాహంగా జరుగుతున్నాయి. మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ 56వ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి ఐదు రోజులుగా స్థానిక మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, బాలుర ఆశ్రమ పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించడంతో పాటు డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన, కుర్చీ ఆటతో పాటు పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలల, కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా ప్రతిరోజు పాల్గొని ఆటపాటలతో గ్రంథాలయంలో సందడి చేస్తున్నారు. దీంతో, స్థానిక గ్రంథాలయంలో గత ఐదు రోజుల నుంచి పండగ వాతావరణం కనిపిస్తుంది. గ్రంథాలయం అంటే దినపత్రికలు, పుస్తకాలు చదవడమే కాదు... విద్యార్థులు, చిన్నారులకు ఆట, పాటలు కూడా నిర్వహించి క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు. దీంతో, విద్యార్థులు ఉత్సాహంగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో పాల్గొంటూ వారి ప్రతిభను కనబరుస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ శాఖ నుంచి బహుమతులు కూడా ప్రభుత్వం అందజేస్తుండటంతో విద్యార్థులు, చిన్నారులు మరింత ఉత్సాహంగా పాల్గొంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా గ్రంథాలయాల్లో చదువు కోవడమే కాకుండా ప్రస్తుతం ఆటల పోటీలు కూడా నిర్వహిస్తుండటంతో పెద్దవారితో పాటు విద్యార్థులు, చిన్నారులకు కూడా ఎంతో ఉపయోగ పడుతున్నాయని పలువురు అంటున్నారు. ఇటువంటి ఆటల పోటీలను నిర్వహించి విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని గ్రంథాలయ శాఖ అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు, పలువురు కోరుతున్నారు.గ్రంథాలయ వారోత్సవాలను ఈ విధంగా ప్రతి ఏటా నిర్వహించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థులు

పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థిని

1500 టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం

-నేరుగా గ్రామాలకు వెళ్లి రైతుల నుంచి సేకరణ
-24 గంటల్లోగా బ్యాంక్ ఖాతాల్లో నగదు చెల్లింపు
-ప్రజాశక్తితో గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ డి. సింహాచలం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలో గిరిజన రైతులు పండిస్తున్న కాఫీ ఈ ఏడాది 1500 టన్నులు కొనుగోలు లక్ష్యంగా జిసిసి ద్వారా సేకరణ ప్రారంభించినట్లు పాడేరు డివిజనల్ మేనేజర్ డి. సింహాచలం వెల్లడించారు. గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల నుంచి కాఫీ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గత వారం నుంచి ప్రారంభించిన ఈ కాఫీ సేకరణకు సంబంధించి వాటి కొనుగోలు ధరలు తదితర వాటిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే ...

కాఫీ కొనుగోలు ధరలు ఎంత?

పార్చ్మెంట్ కాఫీ కిలో ధర రూ.280, చెర్రీ కాఫీ కిలో ధర 145 రూపాయలు, రోబెస్టా చెర్రీ కాఫీ కిలో ధర రూ.70ల చొప్పున రైతులకు చెల్లించి కొనుగోలు చేస్తున్నాం.

గిట్టుబాటు ధర చెల్లింపు ఎలా ?

జిసిసి ద్వారా సేకరిస్తున్న కాఫీకి రైతులకు మంచి గిట్టుబాటు ధర అందిస్తున్నాం. గిరిజన రైతులు పండించే కాఫీని వారపు సంతలకు తెచ్చి విక్రయించే అవసరం లేకుండా గ్రామాలకు వెళ్లి కాఫీ సేకరణ నిర్వహిస్తున్నాం. దీంతో రైతులకు వ్యయ ప్రయాసలు తగ్గుతున్నాయి.

సొసైటీల ద్వారా చేస్తున్న కాఫీ సేకరణ

తమ సొసైటీల ద్వారా 8 మండలాల్లో జిసిసి సేల్స్ మెన్లు, పూలింగ్ అసిస్టెంట్ల ద్వారా గ్రామాల్లో రైతుల నుంచి కాఫీ సేకరణ నిర్వహిస్తున్నాం. మార్చి వరకు గ్రామాల్లో రైతుల నుంచి ఈ కాఫీ సేకరణ నిర్వహించనున్నాం.

కాఫీ నాణ్యతపై అవగాహన కల్పిస్తున్నారా?

కాఫీ సేకరణకు గ్రామాలకు వెళ్ళినప్పుడు రైతులకు కాఫీ నాణ్యత దిగుబడి గురించి అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా కాఫీగింజల ఆరబోత పై తేమ శాతం పరిశీలించి రైతులకు కూడా వివరిస్తున్నాం. దళారీ వ్యాపారులు తూకాల్లో చేసే మోసాలపై తెలియపరచి జిసిసి కొనుగోళ్లను కొనసాగిస్తున్నాం.

కాఫీ సొమ్ము చెల్లింపుల వివరాలు

గ్రామాలకు వెళ్లి జిసిసి ప్రకటించిన ధరల ప్రకారం కాఫీ విక్రయిస్తున్న రైతులకు 24 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాలకు కాఫీ సొమ్ము జమ చేస్తున్నాం. మార్కెట్లో కాఫీకి ధర పెరిగితే అపెక్స్ కమిటీ కాఫీ కొనుగోలు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంటుంది.

కాజ్‌వేను పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని శీలంగొంది రోడ్డు చంపపట్టి గెడ్డ వద్ద కొట్టుకుపోయిన కాజ్వేను పున:నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 2014లో హుదూద్ తుఫాన్ కు ఈ వంతెన కొట్టుకుపోయిందని, అప్పటి నుంచి ప్రభుత్వం పునర్నిర్మించక పోవడంతో శీలం గొంది ప్రాంత గిరిజనులకు రవాణా కష్టాలు ఏర్పడ్డాయని చెప్పారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. తక్షణమే కాజ్వేను పున: నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మధుసూధన్‌రెడ్డి

పర్యాటకులకు సౌకర్యాలు

ప్రజాశక్తి- చింతపల్లి: ప్రధాన ముఖ్య అతిథి సంరక్షణ అధికారి, అటవీ దళాదిపతి, ముఖ్యవణ్య ప్రాణుల సంరక్షణ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి అరుకును సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిహెచ్ సూర్యనారాయణ, డిఎఫ్ఓ చేతుల మీదుగా పలు భవనాలకు శంకుస్థాపన చేశారు. చింతపల్లి ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంకు 90 లక్షలు, డిఎఫ్ఓ బంగ్లా గృహ నిర్మాణంకు రూ.60 లక్షలు, 25 లక్షలతో విద్యుత్తు వాటర్ సదుపాయం కల్పిస్తున్నట్లు డిఎఫ్ఓ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. త్వరలోనే టెండర్ పెట్టి మూడు నాలుగు నెలల్లో చింతపల్లి డివిజన్ కార్యాలయాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. డిసెంబర్ మొదట వారంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే టూరిస్టులకు అన్ని సదుపాయాలతో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ముందుగా టూరిస్టులు ఆన్లైన్‌లో బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలీ, రంపచోడవరం, పాడేరు మండలాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. అరకువేలీ మండలం మాదల పంచాయతిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయాధికారులు డ్రోన్ ద్వారా ఎరువుల పంపిణీ, మందుల పిచకారిపై అవగాహన కల్పించారు. పథకాల ప్రయోజనాలను వివరించారు.పాడేరు మండలంలోని లగిసపల్లి, కిండంగిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పంచాయతి కార్యదర్శులు సిహెచ్ సాయి ప్రకాశ్, కొట్టంగి అమృతదుర్గ పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పెదబయలు: గంజాయి పంట సాగు చేస్తున్న మండలంలోని పోయిపల్లి పంచాయతీ సల్లంగిపుట్టు గ్రామానికి చెందిన కొర్ర రాంబాబును అరెస్టు చేశామని ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. పంట పొలంలో పనిచేస్తున్న రాంబాబుని పట్టుకున్నామన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు.

బాలల హక్కుల ఉల్లంఘన చట్టరీత్యా నేరం

ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - విఆర్‌పురం: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని, వాటిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా నేరస్తులౌతారని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అధ్యక్షుడు కేసలి అప్పారావు హెచ్చరించారు. ఆదివారం రేఖపల్లిలోని వ్యవసాయ సాంఘిక అభివృద్ధి సంస్థ (ఎఎస్‌డిఎస్)లో సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్, బాలల హక్కుల కమిషన్ మాజీ గాంధీబాబు అధ్యక్షతన బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల వేధింపుల నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత 'బాలల వేధింపులు చట్టం అవగాహన' హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, బాలల విద్య, వైద్యం, ఇతర ప్రాథమిక హక్కులు రక్షణకు రాష్ట్రస్థాయిలో కమిషన్ పనిచేస్తోందన్నారు. గాంధీబాబు మాట్లాడుతూ, సంస్థ ఆవిర్భావం నుంచి ఏటా బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహిస్తూ, దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలల స్నేహపూర్వకంగా మండలంగా విఆర్‌పురాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్. వెంకటరావు, ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ, ఏజెన్సీలో బాలల హక్కుల పరిరక్షణకు గాంధీబాబు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలహక్కుల కమిషన్ సభ్యులు టి.ఆదిలక్ష్మి, తహశీల్దారు ఎన్.శ్రీధర్, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు వాళ్ళ కృష్ణారెడ్డి. సుబ్బారావు, రాజ్‌కుమార్, ప్రోగ్రాం మేనేజర్, టిఎస్ఎస్. సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్, పి. మీనా, ఐసిడిఎస్ అధికారులు, చింతూరు, కూనవరం, విఆర్.పురం మండలాల కెజిబివిలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యలో ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులు, క్రీడలు, ఇతర రంగాల్లో నైపుణ్యం చూపిన 27 మంది విద్యార్థులకు పతకాలతోపాటు మెమొంటోలను అందజేశారు.

బాలల హక్కుల చట్టంపై అవగాహన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషన్ చైర్మన్ అప్పారావు, తదితరులు

అంగన్వాడీ భవన నిర్మాణాల్లో నిర్లక్ష్యం

మొండిగోడలతో సగంలోనే ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణం

అర్ధాంతరంగా నిలిచిన పనులు
నెలల తరబడి పట్టించుకోని అధికారులు
అవస్థలు పడుతున్న సిబ్బంది, లబ్ధిదారులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ గ్రామ పంచాయతీలో గరిమండ, అన్నవరం, చీడిపల్లి, బాలరేవుల గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయి, మొండిగోడలతో దిష్టిబొమ్మలా దర్శనిస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆయా భవనాలను పూర్తి చేయడంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. దాదాపు నాలుగునెలలుగా ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను నిర్మాణాలు నిలిపేసిన అధికారులు, కాంట్రాక్టర్లు తర్వాతవీటిపై కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ఆరేళ్లుగా గరిమండ అంగన్వాడీ కేంద్రం పునాదులతోనే దర్శనమిస్తోంది.భవన నిర్మాణాలను పున: ప్రారంభం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అంగన్వాడీ లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారాన్ని ఆయా గ్రామాలకు నేరుగా చేరవేయాలని గడపగడపలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వగా, దీనిపై ఆమె స్పందిస్తూ, తగు చర్యల కోసం సంబంధిత ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు సూచనలు చేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. చింతవానిపాలెం, నేరెళ్లబంద గ్రామాలలో అంగన్వాడీ స్టాక్‌ను దించేసి వెళ్ళిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు ఇతర గ్రామాల్లో పడేసి వెళుతున్న స్టాక్‌ను సొంత గ్రామాలకు తీసుకెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయడం భారమౌతోందని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిఎస్‌ను సందర్శించిన డిఐజి

కొయ్యూరు పోలీస్‌స్టేషన్ తనిఖీకి వచ్చిన డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌ను విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.గంజాయి నిర్మూలన, ఇతర అసాంఘిక చర్యలు అరికట్టేందుకు, అలాగే భద్రతపై పలు సూచనలు చేశారు గంజాయి అక్రమరవాణాలో బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలకు వెనకాడ వద్దని ఆదేశించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో మారుమూల గ్రామాలైన బూదరాళ్ల, యు.చీడిపాలెం,మఠం భీమవరం పంచాయతీలలో గిరిజన సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీస్ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొయ్యూరు పోలీస్‌స్టేషన్ సందర్శనలో విశాఖపట్నం రేంజ్ డిఐజి హరికృష్ణతోపాటు చింతపల్లి అడిషనల్ ఎస్‌పి కె. శివప్రతాప్ కిషోర్ ఉన్నారు.

సమన్వయంతో క్షయవ్యాధి నిర్మూలన

జిల్లా క్షయవ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ విశ్వనాథం

వైద్యసేవలపై రోగిని ప్రశ్నిస్తున్న డాక్టర్ విశ్వనాథం

ప్రజాశక్తి -సీలేరు: .క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ వ్యాధి నిర్మూలనకు వైద్యాధికారులు, సిబ్బంది, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్వైజర్లు, సమన్వయంతో పనిచేయాలని జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ టి.విశ్వనాథం ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, కె.సౌమ్యలతో సమావేశమై, పిహెచ్‌సిలో నమోదైన క్షయవ్యాధి కేసులపై ఆరా తీశారు. హితవు పలికారు. మారుమూల గ్రామ గిరిజనులకు వైద్య సేవలు అందించడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ల్యాబ్, ఫార్మసీ రూమ్, వార్డులోని రోగులు బెడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది కొరత ఉందని ఆయన దృష్టికి తేగా, పిహెచ్‌సిలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ కె. జ్యోతిబాబు, హెల్త్ సూపర్‌వైజర్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని మిషన్‌కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు దాసరి ఉమ మహేష్, తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ పాల్గొని 150 మందికి వైద్యసేవలు చేశారు. వీరిలో 61 మందికి రక్తపరీక్షలు, ఐదుగురికి థైరాయిడ్, 16 మందికి ఎక్స్‌రేలు, 12మందికి ఫిజియోథెరపీ చేశారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది, వాలంటీర్ గాదిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

జనసేనలో 35 కుటుంబాల చేరిక

పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న కుర్ల రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని రంప పంచాయతీ దొర వీధిలో మండల అధ్యక్షుడు పిఆర్‌పి శ్రీను ఆధ్వర్యంలో 35 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేశారు. జనసేన, టిడిపి ఉమ్మడి కార్యక్రమాలు సమన్వయకర్త కుర్ల రాజశేఖర్‌రెడ్డి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. వైసిపి అమలు చేస్తున్న విధానాల వల్లే గిరిజనులు విద్యకు దూరమై, ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన్యంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో కొనతం శ్రీనివాస్, ఆకుల జయరాం, కొమరం పండు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘననివాళి

ప్రజాశక్తి -చింతూరు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 106వ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి పలువురు కాంగ్రెస్‌నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల కాంగ్రెస్ నేత అహ్మద్‌ఆలీ మాట్లాడుతూ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ . 20 సూత్రాల పథకం, బహుళార్ధ సాధక ప్రాజెక్టుల నిర్మాణం భూసంస్కరణలు, ఇతర పథకాలతో దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు తెచ్చారని కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నేతలు. ఎండి జోహార్. కన్నారావు. దాసరి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు

చూసొద్దాం.. రారండి

- సుందరంగా పర్యాటక ప్రాంతాలు

- ఆకట్టుకుంటున్న అల్లూరి పార్క్

ప్రజాశక్తి-గొలుగొండ:కార్తీకమాసం వచ్చిందంటే నర్సీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలంతా ఒక్కసారిగా విహార యాత్రలకు గొలుగొండ మండలం వైపు వస్తున్నారు. మండలంలో విహార యాత్రలకు ధారమఠం, అల్లూరి పార్కు, కేడీపేట సమీపంలో ఉన్న వల్లాపేట జలపాతం అందరి దృష్టిని ఆకర్షిస్తాయి.

మండలంలో ధారమఠంలో వెలిసిన ధారమల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంతంకు వెళితే దైవదర్శనంతో పాటుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపవచ్చు. పచ్చని చెట్లతో నిండివున్న కొండలనడుమ బండరాళ్ల మధ్య నుండి ప్రవహిస్తున్న సెలయేరు ఒకవైపు. ఈ ప్రాంతానికి వచ్చినవారు సాయంత్రం వరకు గడపడానికి వీలుగా వున్న నీటి తొట్టెలు, మరోవైపు చూపరులను ఆకట్టుకుని విధంగా ఉంటాయి. మన్యంలో తెల్లదొరలపై విప్లవం చేసిన అల్లూరి సీతారామరాజు ఎక్కువగా ఇక్కడ గడి పేవారని పెద్దలు చెబుతుంటారు. ప్రాధాన్యత కలిగిన పవిత్ర దినాల్లోను కార్తీక మాసంలోను, ఈ ప్రాంతం అంతా శివపూజలు చేసే భక్తులు, వనభోజనాలకు వచ్చే సందర్శకులతో సందడిగా ఉంటుంది. సందర్శకుల సౌకర్యార్థం స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గది, విశ్రాంతి తీసుకునేందుకు షెడ్లను టూరిజం శాఖవారు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు పూజలు చేసుకోవడానికి, సందర్శకులు ఆహ్లాదంగా గడపడానికి అన్ని వసతులు ఇక్కడ వుండడంతో కార్తీకమాసం సీజనంతా దూరప్రాంతాల నుంచి వందల సంఖ్యలో సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. అలాగే శివరాత్రికి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి ధారామల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తారు.

మండలకేంద్రం గొలుగొండ నుంచి 5 కిలోమీటర్లు దూరం ప్రయాణంచేస్తే ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. గొలుగొండ నుంచి తారురోడ్డు ఉండడంతో ఇక్కడకు చేరుకోవడానికి అన్నిరకాల వాహనాలు అందుబాటులో వుంటాయి.

అల్లూరి పార్క్ ప్రత్యేకత:

మండలంలో కేడీపేట గ్రామంలో ఉన్న అల్లూరి సమాధుల ప్రాంతం అల్లూరి పార్కుగా అభివృద్ధి చెంది విహారయాత్రకు అనుకూలంగా ఉంటుంది. ఒక్క విహారయాత్రకే కాకుండా అల్లూరి పార్క్ వస్తే విజ్ఞాన యాత్ర కూడా పూర్తవుతుంది. అల్లూరి పార్కులో విహారయాత్రకు అనువుగా ఆహ్లాద కరమైన పార్కు ప్రాంతం. సందర్శకులు వేచి ఉండడానికి షెడ్లు, కూర్చోవడానికి గ్రానైట్ బల్లలు అనుకూలంగా ఉంటాయి. మన్యం విప్లవానికి సంబంధించిన అంశాలకు చెందిన సుమారు 16 శిలాఫలకాలు పార్కు గోడలపై అంటించి ఉన్నాయి. దీంతో మన్యం విప్లవం జరిగిన రెండు సంవత్సరాల కాలంలో అల్లూరి సీతారామరాజు మన్యం వీరులు తో కలిసి చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు ఈ శిలాఫలకాలపై ఉన్నాయి. అంతేకాక ఆయన చరిత్రను తెలియజేయడానికి డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించడానికి మినీ థియేటర్ కూడా పార్కులో ఉంది. అలాగే పార్క్ ఆనుకుని దిగువ భాగంలో పెద్ద సెలయేరు నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది.. వీటన్నింటితో అల్లూరి పార్క్ వస్తే సందర్శకులకు విహారంతో పాటుగా విజ్ఞానయాత్ర కూడా జరిగినట్లు అవుతుంది. అలాగే ఇక్కడికి సమీపంలో ఉన్న వల్లాపేట జలపాతం కూడా విహార యాత్రలకు అనువుగా ఉంటుంది. అలాగే కేడీపేటకు సమీపంలోని వల్లాపేట జలపాతానికి వచ్చేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఈ జలపాతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది.

ఆహ్లాదంగా ఉన్న అల్లూరి పార్కు

మన్యంలో పెరిగిన పొగమంచు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి పాడేరు:- అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గత రెండు రోజులు నుంచి చలి తీవ్రత పెరుగుతోంది. కార్తీక మాసం ఆరంభంతోనే మంచు కాలం ముంచుకొస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రేయింపగళ్ళు దట్టంగా పొగ మంచు కురుస్తుండడంతో చలి ప్రభావం పెరిగింది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండడంతో మన్యంలో నివసించే ప్రజలు వణుకుతూ చలి రాగం మొదలుపెట్టారు. దట్టంగా కురిసే పొగ మంచుతో ఉదయం సాయంత్రం రాత్రివేళలో పనులు చేసుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. చలి ప్రభావంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది.

పర్యాటకుల సందడి..

ఏజెన్సీలోని పాడేరు పరిసరాల్లో పర్యాటకుల తాకిడి మొదలయ్యింది. ఒకవైపు కార్తీకమాసం వన మహోత్సవాల సందడితోపాటు ఈ ప్రాంతానికి సందర్శనకు వచ్చే పర్యాటకులతో సందడి నెలకొంది. వణికించే చలిని సైతం ఆస్వాదిస్తూ పర్యాటకులు మంచులో విహరిస్తున్నారు. వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం ప్రాంతాలకు నిత్యం పర్యాటకులు తరలి వస్తున్నారు, దీంతో, ఈ ప్రాంతాలన్నీ సందడిగా మారాయి..

పొగ మంచులో లైట్లు వేసుకొని నడుస్తున్న వాహనాలు

వరిపై సన్నగిల్లిన ఆశలు

-ఎండిన పంటలు

-ఆందోళనలో తాండవ కాలువ రైతులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా ఈ ఏడాది తీవ్ర వర్షా బావ పరిస్థితుల కారణంగా వరి రైతు ఆశలు సన్నగిల్లాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరిపై ఆధారపడి రైతులు అత్యధికంగా ఉన్నారు. మండలంలో సుమారు 1600 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా సుమారు 1500 వరకు సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

మండలంలో ప్రధాన నీటి వనరు వరహానది, సర్పా నదీలు ఉన్నాయి. తాండవ కాలువ నుంచి ఈ ఏడాది ఆది నుంచి అంతంత మాత్రమే నీటి సరఫరా అయ్యింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలకు రైతులు వరిపై ఆశలు పెంచుకొని నాట్లు వేశారు. ఏదోలా ఉన్న కొద్దిపాటి నీటి వనరులతో పొట్ట దశకు వరి పొలాలు చేరుకున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధానంగా తాండవ కాలువపై ఆధారపడ్డ రైతుల పంట పొలాలు తీవ్రంగా ఎండి పోతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికి కరువు మండలంగా ప్రకటించక పోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతున్నారు.

రావికమతం:ఈ ఏడాది వరుణుడు కరుణించక పోవడంతో రైతాంగం పూర్తిగా నష్టపోయింది. మండలంలో ప్రముఖంగా ప్రధానంగా వరి, చెరుకు పంటలు పండిస్తున్నారు. ఇందులో వరి పంట ప్రధానమైంది. గత ఏడాది వరకు వర్షాకాల ప్రభావంతో పాటు పెద్దేరు రిజర్వాయర్ కాలువ నీరు కూడా పుష్కలంగా రావడంతో వందలాది ఎకరాలలో పంటలు పండేవి. ఈ ఏడాది వర్షాలు పడక పోవడంతో పాటు పెద్దేరు రిజర్వాయర్ కాలువ నీరు కూడా రాక పోవడంతో రైతాంగం పూర్తిగా నష్టపోయింది. వరి పంటలు పొట్ట దశకు వచ్చే వరకు అడపాదడపా కాలువలు, చెరువులు, నీటి గుంటలో ఉన్న నీటితో మోటార్లు పెట్టి తడుపుకొని రక్షించుకున్నారు. వర్షాలు నేటి వరకు పడక పోవడంతో వరి పంటలు పూర్తిగా వట్టి గడ్డిని తలపిస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి సైతం రాకపోగా తెచ్చిపెట్టిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేని పరిస్థితి నెలకొందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

ప్రజాశక్తి -చీడికాడ: మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను అర్జునగిరి ఎంపీటీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పరదేశి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో వివిధ సంస్కరణలు ఆమె చేశారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జోగారావు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఆమె సేవలను కొనియాడారు.

మాడుగుల: స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ ఎడ్ల కళావతి నివాళి అర్పించారు. గ్రంథాలయం ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, సంక్షేమ పథకాలపై డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దిశ చట్టంపై చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

చీడికాడ:స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.



యుటిఎఫ్ విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయం

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణమే యుటిఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. హస్మిభవన్‌లోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూనియన్ 49వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్తగా ఎంవిఎస్.శర్మ హాజరై ప్రసంగించారు. జిఒ 117 కారణంగా ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థంగా మారిందన్నారు. విద్య, వైద్య రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తుందన్నారు. క్రమంగా వీటి ప్రయివేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ రంగ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అదే సందర్భంలో ప్రజల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను, నూతన జాతీయ విద్యా విధానాన్ని తిప్పి కొట్టాలన్నారు. సిపిఎస్ రద్దు హామీ మద్దతుతో గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని తీసుకురావడం ఉపాధ్యాయుల గొంతు కోయటమేనని పేర్కొన్నారు. 2024 ఎన్నికలలో ప్రతి రాజకీయ పార్టీ పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చే విధంగా పోరాటం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పోరాడి ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు వ్యవహరించారు.

కమిటీ ఎన్నిక

గౌరవాధ్యక్షునిగా అనకాపల్లి పైడిరాజు, జిల్లా అధ్యక్షునిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టిఆర్.అంబేద్కర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్.ప్రభాకరరావు, రొంగలి ఉమాదేవి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉప్పాడ రాము, చుక్కా సత్యం, రియాజ్, తాటికొండ జగన్, రిజ్వాన్, వంగా రామలక్ష్మి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్ఎస్.నాగమణి, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా జి.ఉషారాణి, కో-కన్వీనర్‌గా ఆవుగడ్డ సత్యకళ ఎన్నికయ్యారు.

శరవేగంగా డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. రావికమతం-చోడవరం- నర్సీపట్నంకు వెళ్లే ఆర్ అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించే పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా చక్కగా రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఆక్రమణలకు గురవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీలు ఇబ్బందులు పడేవారు. కొన్ని సార్లు ప్రమాదాలు కూడా జరిగేవి. ఇటువంటి తరుణంలో ఈ ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించడంతో వర్షానికి వచ్చే నీరు రోడ్డుపై పారకుండా, నిల్వ ఉండకుండా డ్రైనేజీ నుంచి వెళ్లే విధంగా చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎఎల్.పురంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం ఎంపియుపి పాఠశాలలో ఆదివారం సత్యసాయి బాబా జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ గోనిపాటి ధర్మారావు

ఉత్తమ ప్రాంతీయ కేంద్రంగా 'ఇగ్నో విశాఖ'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 38వ వ్యవస్థాపక దినోత్సవ వేళ ఆ వర్సిటీ విశాఖ ప్రాంతీయ కేంద్రానికి అరుదైన గౌరవం దక్కింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ కేంద్రంగా విశాఖ ఎంపికైంది. 2023వ సంవత్సరానికి సంబంధించిన ఈ ఉత్తమ ప్రాంతీయ కేంద్ర అవార్డును న్యూ ఢిల్లీలో జరిగిన ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో బహూకరించారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినియ్ కుమార్ సక్సేనా చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఈ అవార్డు అందరి సమిష్టి కృషి ఫలితంగా వచ్చిందన్నారు. విశాఖపట్నం ప్రాంతంలో 12 అధ్యయన కేంద్రాల ద్వారా వేల మందికి నాణ్యమైన ఉన్నత, నైపుణ్య విద్యను అందిస్తున్నట్టు తెలిపారు.

మాట్లాడుతున్న ఎయు విసి ప్రసాద్‌రెడ్డి

ఘనంగా 'రంజిత్' వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రియల్ ఎస్టేట్ రంగంలో స్థాపించిన అతి తక్కువ కాలంలోనే ఖాతాదారుల విశ్వాసాన్ని పొందిన రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ సంస్థ మూడో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం నగరంలోని దసపల్లా హోటల్‌లో వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్థాపించిన మూడేళ్లలో ఎనిమిది వెంచర్లు పూర్తి చేయటం ఎంతో గొప్ప విషయమని, ఇది కేవలం నాణ్యత, కచ్చితత్వం ఉంటేనే సాధ్యమని అన్నారు. రానున్న కాలంలో విశాఖ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ రాజధానిగా పేరుగాంచిన విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. అనంతరం రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ భోగాపురం వద్ద 14 ఎకరాల్లో నిర్మిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ 9వ వెంచర్ 'గీతా గోవిందం' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ అధినేత అన్నేపు రంజిత్ కుమార్, వైసిపి నాయకులు గన్నమనేని వెంకటేశ్వర రావు (జివి), పేడాడ రమణి కుమారి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రవీంద్ర భారత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాల మద్దిలపాలెం బ్రాంచి ఆధ్వర్యంలో బహుముఖ పోటీలు నిర్వహించారు. డమ్మీ ఫ్రేమ్ లెన్స్‌పై విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బొమ్మలు గీశారు. బ్రాంచి కంటి ఆసుపత్రి ఇన్‌ఛార్జి ఉషా ఆత్మకూరి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

దయనీయ బతుకులు

రెండో రోజూ కొనసాగిన బిఆర్‌టిఎస్ విస్తరణ పనులు

రోడ్డున పడ్డ సింహాచలం, అడవివరం వాసులు

నష్టపరిహారం చెల్లించకుండానే ఇళ్ల తొలగింపుపై మండిపాటు

బాధితులకు అండగా సిపిఎం, టిడిపి

ప్రజాశక్తి - సింహాచలం

బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనులతో సింహాచలం, అడవివరం ప్రాంత ప్రజల బతుకులు దయనీయంగా మారాయి. తీవ్ర ఉద్రిక్తతల నడుమ శనివారం ప్రారంభమైన ఈ పనులు ఆదివారమూ కొనసాగాయి. జెసిబితో జివిఎంసి సిబ్బంది అప్పన్న తొలి పావంచా నుంచి అడవివరం వరకూ రోడ్డుకిరువైపులా ఉన్న నివాస గృహాలను కూల్చివేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా, ఎటువంటి సమాచారమూ తెలియజేయకుండా ఉన్నఫళంగా వారు ఈ చర్యకు ఒడిగట్టడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. తమ ఇళ్లలోని సామాన్లను సైతం తీసుకోనీయకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులను చూసిన వారు 'మరీ ఇంత దౌర్జన్యమా ?' అని అనడం కనిపించింది.

ఇళ్లను కూల్చివేయడంతో అడవివరం ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వచ్చిన బాధితులు

బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ఇళ్ల తొలగింపుతో రోడ్డున పడ్డ బాధితులను సిపిఎం 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గోపాలపట్నం జోన్ నాయకులు బి.వెంకటరావు తదితరులు పరామర్శించారు. బాధితులకు అండగా ఉండి పోరాటం నిర్వహిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ బాధితులకు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించకుండా నిరంకుశంగా ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. అధికారులు ఇటీవల నోటీసులు ఇచ్చి 15 రోజుల్లోగా అభ్యంతరం తెలియజేయాలని కోరారని, గడువు తీరక ముందే నాలుగు రోజుల్లోనే ఎటువంటి సమాచారమూ లేకుండా ఇలా దౌర్జన్యంగా వ్యవహరించడం తగని పనని తెలిపారు. బుల్డోజర్లతో ఇళ్లను తొలగించడం దుర్మార్గమన్నారు. బాధితుల తరపున కలెక్టర్‌ను, జివిఎంసి కమిషనర్‌ను కలిసి అందాల్సిన నష్టపరిహారం, టిడిఆర్‌ల కోసం కృషి చేస్తామన్నారు. ఇంత జరిగినా ఇంతవరకూ స్థానిక ఎమ్మెల్యే కనిపించకుండా పోవడం శోచనీయమన్నారు.

బాధిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

టిడిపి నేతల పర్యటన

బాధితులను పరామర్శించేందుకు సంబంధిత ప్రాంతంలో టిడిపి నేతలు పర్యటించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు పివి.నరసింహం, శంకరరావు, శ్రీనివాసరావు, మొల్లి లక్ష్మణరావు, పీలా శ్రీనివాసరావు, పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్ బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేతగానితనం వల్లే ప్రజలను నష్టపరిచే విధంగా పనులు జరుగుతున్నాయని విమర్శించారు. బాధితులను ఆదుకునేందుకు తక్షణం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

సమాజం పట్ల మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమాజం పట్ల మీడియా బాధ్యతగా వ్యవహరించాలని రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్ లో 'వై-5 తెలుగు వార్తలు' వెబ్ ఛానల్ ప్రథమ వార్షికోత్సవం జరిగింది. దీనిలో భాగంగా వివిధ రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నగరానికి చెందిన పలువురిని విశాఖ మిత్ర, విశాఖ కేసరి అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్ సన్ మూర్తి, సింహాచలం దేవస్థానం పాలక మండల సభ్యులు గంట్ల శ్రీనుబాబు, 32వ వార్డు జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, జెకె న్యూస్ ఛానల్ అధినేత జగదీష్, వై 5 ఛానల్ నిర్వాహకులు ఎ.మోహనరావు పాల్గొన్నారు.

22న దళిత హక్కుల రక్షణపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ - సామాజిక న్యాయం'పై ఈ నెల 22న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సదస్సు కరపత్రాన్ని ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఐ (ఎ) జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకరరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న మాట్లాడారు. దేశంలో మనువాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిడిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రామమూర్తి, రచయిత్రి గోగులమండ అరుణ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వై.రాజు, ఎం.ఈశ్వరరావు, ఎన్.ఎర్రిబాబు, కె.అప్పారావు, సిహెచ్ రామారావు, జివిఎంసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముద్దాడ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

960వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాగుతున్న రిలే దీక్షలు ఆదివారానికి 960వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను బేషరతుగా విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం ప్రైవేటుపరం చేస్తామని పార్లమెంట్‌లోనే బిజెపి మంత్రులు ప్రకటన చేయడం దారుణమన్నారు. విశాఖలో ఆ పార్టీ ఎంపీ జివిఎల్ నరసింహారావు బూటకపు ప్రకటనలు చేయడాన్ని ప్రజలంతా గుర్తిస్తున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణలో కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు జి.వామనమూర్తి, కోటా సత్తిబాబు, జె.రామకృష్ణ, కాసారపు సత్యనారాయణ, కొండపు ఈశ్వరరావు, లంకా గోవిందు, కె.శివ, ఎస్.రమేష్, కె.వినోద్‌రావు పాల్గొన్నారు.

37వ వార్డులో బెల్ట్ షాపులు తొలగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఎక్కడా లేనివిధంగా 37వ వార్డు రైల్వే ప్రాంతంలో మద్యం బెల్టు షాపులు అధికంగా ఉన్నాయని, వాటిని తక్షణం నిర్మూలించాలని ఆ వార్డు వైసిపి కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బెల్టు షాపుల్లో కల్తీ మద్యం అధికంగా విక్రయిస్తున్నారన్నారు. మరోవైపు గంజాయి వంటి మత్తు పదార్థాలను విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల యువత, ముఖ్యంగా కార్మికులు వ్యసనాలకు బానిసవుతున్నారని ఆవేదన వెలుబుచ్చారు. వార్డులో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తుంటే బెల్టు షాపుల వారు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మత్స్యకార సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పెంటయ్య మాస్టారు, చింతపల్లి అయ్యప్పరాజు, జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమహ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యోగా, మెడిటేషన్, సంగీతం, మార్షల్ ఆర్ట్స్ వంటి కళలను ఒకే చోట నేర్చుకునే విధంగా స్వాతి మన్నేపల్లి స్థాపించిన నమహ ఇనిస్టిట్యూట్‌ను ఆదివారం ఉదయం ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి మందా సుధారాణి, ఆంధ్ర విశ్వవిద్యాలయ అకడమిక్ విశ్లేషకులు భారత్ సూర్య, ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ దయమాయ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలన్నీ వివిధ విభాగాలకు చెందినవైనప్పటికీ అన్నింటినీ ఒకే చోట నేర్పించడం గొప్ప విషయమన్నారు.

ఎయులో ప్రపంచ సంస్మరణ దినం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోడ్డు ప్రమాద బాధితుల కోసం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీలోని డాక్టర్ వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రపంచ సంస్మరణ దినం - 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రత్యేక అతిథిగా మేయర్ జి.హరి వెంకట కుమారి హాజరయ్యారు.